# కావేరి

బహుళపక్షపు పల్చటి వెన్నెల.... ఆ వెన్నెల్లాంటి ఆవేదన.... వ్యక్తావ్యక్తంగా... అటు చీకటి ఇటు వెల్తురుకాని ఏదో సంకీర్ణ భావన. ఓ స్వాప్నికావస్థ నుంచీ ఇంకో స్వప్నంలోకి వలస వెళ్లాలన్న ఆరాటం మనసుతోనిమిత్తం లేకుండా శరీరానికి బానిసై జీవితాన్ని పూర్తి చేయడమేనా?

అసలు శరీరానికి అతీతమై మనసుంటుందా? నేను శారీరకంగా జీవించానా? మానసికంగా జీవించానా? నా మనస్సే జీవితమైతే కావేరి గురించి ఆలోచన ఈషణ్మాత్రం లేకుండా ఎలా జీవించాను?

దిండుని తలక్రింద సర్దుకుని .. రెయిలింగ్ చీలికలోంచి కనిపిస్తున్న సగం చంద్రుడిలోకి చూస్తున్నా. గాలికూగుతున్న యూకలిప్టస్ నీడలు చైనా వేజ్‌మీది చిత్రాలు కదులుతున్నట్టు ... నల్లటి చీకటి చిత్రాల్లా...

"నాన్నా!"

ఆ నిశ్శబ్దాన్నీ... ఆ నీరవ చైతన్యాన్నీ....నా క్లిష్ట ఆవేదననూ చీల్చుకుని ..ప్రియ మెత్తటి స్వరం..

వచ్చి కుర్చీ పక్కనే నేలమీద కూర్చుని నా చేయి మీద చేయి వేసి మళ్లీ పిలిచింది. పిలిచి,

"షూ ఆఫ్ దట్ ఆల్బట్రోస్, నాన్నా! ఐ కాంట్ స్టాండ్ దిస్ మెలంకలీ! వెళ్దాం అలా.

ఎక్కడికైనా.. ఫరె వీక్ ఆర్ సో.. ఎవ్రీ డే ఈజె ఫ్యాక్సిమలీ ఆఫ్ ద ప్రీవియస్ డే! వద్దు, నాన్నా! ప్లీజ్, నిజం చెప్పు, నువ్వు వయొలీన్తాకిఎన్ని రోజులైంది? లెటలోన్ వయొలిన్.. నువ్వు నాతో మనస్ఫూర్తిగా మాట్లాడి ఎన్ని రోజులైందో తెల్సా? నో, ఐ కాన్ట్ స్టాండ్దిస్ ఎనీ మోర్,నాన్నా! ఐ లవ్యూ నాన్నా!" చేతి మీద తలానించి చిన్నగా ఏడవసాగింది ప్రియ.

నా కళ్లనిండిన నీళ్లు ధారగా కారిపోతున్నాయి. బాధతో, కన్నీళ్లతో తడిసి మాటలు అలుక్కుపోయాయి. అక్షరాలు తడితడిగా ముద్దముద్దగా...

"ఆ... అమ్మలూ! నేనెలా చెప్పనే నీకు.. కావేరీ... మై వండర్‌ఫుల్ వైఫ్...యూనో? షీ డింట్ డై జస్ట్ లైక్దట్! అయ్ కిల్డ్ హర్.

నిజమమ్మలూ... మీ అమ్మను చంపేశానురా! నేను చేజేతులా... విద్దీజ్ డర్టీ హేండ్స్... ఐ కిల్డ్ యువర్ బిలవ్డ్ మదర్!"

"లేద్నాన్నా! నాకు తెల్సు... బోతాఫ్ యు నెవర్ బిలాంగ్డ్ టు ద సేమ్ వల్డ్! అసలు అమ్మ చనిపోయే హాయిగా ఉందేమో నాన్నా!" హోరుమని ఆ లేత మనసు మహోధృత సోహినిలా.. తెలీని చీకటి లోతుల్లోకి దూకేసిన శబ్దం... నన్నావరించింది.

ప్రియ చేతిని నా రెండు చేతుల్తోటి చుట్టి, అలా పట్టుకుని నాకు నేనూ, నాకు తనూ తనకి నేనూ అవుతూ మళ్లీ ఎవరికీ ఏమీ కాక.... మాకు మేమై ఏకాంతాన్ని తరిమేస్తూ.. ఏకాంతన్నే కావులించుకుంటూ ఏకాంతాన్నే తాగేస్తూ మళ్లీ ఏకాంతాన్ని కక్కేస్తూ...

నా చిన్న ముద్దుల పాప, నా ప్రియా నేనూ.. ఆ పిచ్చి చంద్రుడి పల్చటి వెన్నెట్లో.. బాల్కనీలో అలా ఉండిపోయాం... యూకలిప్టస్ చెట్లు చైనా వేజ్‌మీదకి ట్రాన్స్‌మైగ్రేట్ కాలేదు. చంద్రుడు నా డాబాలోకి తొంగి చూస్తున్నాడు. నన్నో అపరాధిని చూసినట్టు.. నా భుజమ్మీద వాలినఅల్‌బట్రోస్ రెక్కలు విసరక అలాగే ఉంది... ఆకాశానికి భూమికీ ఎవ్వరూ గీయని ఓ సరిహద్దు రేఖ చెరిగిపోక అలాగే ఉంది.. నాలోని అపరాధ భావనలా...

✦ ✦ ✦

సరిగ్గా ఇరవై అయిదు సంవత్సరాల క్రితం, నాకూ, కావేరీకి వివాహం అయింది. నా పిఎచ్.డి. ఊహల్లోంచి ...శరీరపు దాడిలో ఓడిపోయిన మనసుతో...

అందంగా పెద్ద పెద్ద జాలికళ్ల కావేరిని.

గాజు బొమ్మలాంటి కావేరిని...

చెలరేగి అలసిపోయిన సౌందర్యం... కావేరిని..

స్త్రీ శరీరమే కాదు, మనసూ, జీవితమూ... ఆ జీవిత అర్థమూ పరమార్థమూ.. అన్నీ సొంతం పురుషుడికే చెందాలనే అమాయకపు కావేరిని...

వేసంగి సాయంత్రపు మల్లెల రాశిలా ఉందనుకున్న కావేరిని చూసి అక్కడికక్కడే చెప్పేశాను.. 'తనకిష్టమైతే' ముహూర్తాలు పెట్టేయమని. మావాళ్లు నాకు చూసిన మొదటి సంబంధమది.

శోభనపు గదిలోకడుగుపెట్టిన మరుక్షనం నా కాళ్లకి దండం పెట్టిన తనని వారించి నాకలాంటివి నచ్చవన్జెప్పి నేనూ తన కాళ్లకి దండం పెట్టబోతే.. విస్మయం తానే అయ్యి.. ముడుచుకుపోయిందే తప్ప మాట్లాడలేదు.

ఓ మూణ్ణెళ్లు శరీరపు పెనుగులాటలో నేనేమీ పట్టించుకోలేదు. ప్రాకృతిక లిప్సల

మత్తునుంచీ కోలుకునే సరికి అర్థమైపోయింది. తనకూ అంటూ ఏ భావాలూ, అభిరుచులూలేవు. ఉన్నా తను వెలిబుచ్చదు.

నా ఇష్టాలే తనిష్టాలు.. నా అయిష్టాలన్నీ తనవే...

"ముబారక్బేగం గొంతు విన్నవా కావేరీ?" అనడిగినప్పుడు.. ముబారక్‌బేగమెవరో తనకి తెలీనందుకు తనేదో ఘోర అపరాధం చేసేసినట్లు బాధపడిపోయి నన్నూ బాధపెట్టింది.

నేను సంధ్య వార్చనూ... కనీసం భోయనానికి్కూచున్నప్పుడు పరిషేచన కూడా చేయనూ.. అసలు యజ్ఞోపవీతం వేసుకోనూ, అని తెల్సుకుని తీవ్రమైన వేదనకు లోనైందే తప్ప,నన్ను ఎందుకూ, ఏమిటీ అని ప్రశ్నించలేదు. వాళ్లింటికి మేమిద్దరం కలిసి వెళ్లినప్పుడు కూడా ఈ విషయమై వాళ్లింట్లో వాళ్లు ఎక్కడ చర్చకు దిగుతారో అని..

"వారికి ఒంటరిగా భోయనం చైడం అలవాటు.. అందునా కిందకూచుని ఆయన భోయనం చైలేరూ.. పంక్తికి ఆయన్ని పిలవకండి!" అని భోజనం మా గదిలోకే తెచ్చేది.

ప్రళయమొచ్చినా సరే.. నేనేమి చేసినా తాను ఆనందంగానే అంగీకరించాలి అన్న మనసత్వం కావేరిది. రానురానూ ఆమె బానిసత్వం భరించడం కష్టమైపోయింది నాకు. తనో అద్దం ముక్కలా అయిపోయింది. అందులో నా బొమ్మే! అద్దానికి అనుభూతులుండవు... తనకులాగా.. ప్రతిబింబించడమే దాని పని. బింబమూ ప్రతిబింబమూ నేనే! .. నేనే...! ఈ రోజున కావేరీ అనే అద్దం భళ్లున బద్దలై వేయి ముక్కలైనా వేయి 'నేను'లుగా ప్రతిబింబిస్తున్నానే తప్ప 'నేను' నాశనం కాలేదు.

"కా.......వే.......రీ..." మనసు బాధగా మూలుగుతోంది.

పెళ్లయిన కొత్తలో కొన్ని రోజులు నాగ్‌పూర్లో ఉండాల్సొచ్చింది. కొలీగ్స్ అంతా కలిసి పార్టీ హోస్ట్ చేశారు కొత్త దంపతులమని. గోలగోలగా పార్టీ.. డ్రింక్ సర్వ్ చేస్తున్నారు. ఎన్వీ.. వెజ్ అంతా కలిసే ఉన్నాయి. బఫే. ఎవళ్ల రీతిలో వాళ్లు ఎంజాయ్ చేస్తున్నారు. మేము ఓ సాకు మాత్రమే ఆ పార్టీకి, అందరికీ కావేరిని పరిచయం చేశాను. ఆమె సౌందర్యానికి అబ్బురపడిపోయారందరూ.

నేను పార్టీలో తాగనందుకు కావేరి సంతోషించి ఉండవచ్చు. ఒకవేళ తాగినా. తనన్తాను సమాధానపర్చుకునుండేదేమో.

చౌహాన్ భార్యతో కావేరి మెల్లగానే అయినా స్పష్టంగా అనడం విన్నాను.

"ఐయామ్ నాట్ యూజ్డ్ టు దిస్సార్టాఫ్ లైఫ్! ఐ అపాలజైజ్ ఫార్మై అనీజీనెస్!"

అటువంటిచోట ఇమడలేకపోవడం తనతప్పు అనుకుందే తప్ప ఇంకో భావం లేదు.

క్రమంగా ఆమెనుంచి దూరాన్ని కోరుకోసాగాను.

ఆస్ట్రేలియా వెళ్తూ తనని ఇక్కడే వదలి వెళ్లాను. ఆమెను వెంట తీసుకెళ్లే

అవకాశముండీ.. అదామెకుతెలుసో తెలీదో నాకుతెలియదు. ఎనిమిది నెల్ల కాలం ఆమెలో మార్పు తెస్తుందని ఆశించాను. ఆ ఎనిమిదినెలల్లో నేన్రెండుత్తరాలు రాస్తే తానొక్కటి రాసింది. 'పూజ్యులైనవారికి' అంటూ మొదలుపెట్టి 'మీ కావేరి' అని ముగించిన ఆ ఒక్క ఉత్తరంలో... నా బాగోగులూ... భోజన వసతులూ లాంటి మామూలువిషయాలే తప్ప.. శరీరాన్ని మనసునూ సంధించి బంధించి.. ఒక్క అనురాగపు పదం?! ఒక్క ప్రేమైక వాక్యం?! ఒక్క కామాతురలిప్స?! ఊహూఁ... నిజానికి అవే మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు.. నేను రెండూ ఆమె ఒకటి.. మా జీవితానికి....

తను రాసిన ఉత్తరాన్ని నేనెప్పుడో చిత్తుకాగితంలా పారేశాను. నే వ్రాసిన రెండుత్తరాలు మాత్రం. కావేరీ మరణించిన తర్వాత తన పెళ్లి చీర మడతల్లో మొగిలి రేకుల మధ్యన కనబడి... నన్ను నిట్టనిలువునా చీల్చి హింసించాయి...

మా పెళ్లయిన నాలుగో సంవత్సరం ప్రియ తన కడుపున పడింది. మాతృత్వం ఆమెలో మార్పు తెస్తుందని ఆశించాను. ఊహూఁ.. తల్లిగా తన బాధ్యతలు నెరవేర్చిందే తప్ప... ఆమెజీవితంలో నాకున్న స్థానంలో ఒక్క మిల్లీమీటరు కూడా ప్రియకు ఇవ్వలేదు తను.

డెలివరీ కష్టమై... పళ్ల బిగువున ప్రాకృతిక హింసను భరిస్తూనే నేను ఆ రోజుఉదయం నుంచీ భోయనం చేయలేదన్న విషయాన్ని గుర్తుకు పెట్టుకుని...

"ఉదయం నుంచీ భోయనం చైలేదు మీరు... వె.....హెళ్లి....కా...హాస్తా... ఎంగిలి పడండి... నాకేం కాదు!" అని వాళ్లన్నయ్యని దగ్గరగా పిల్చి నా భోజనం సంగచ్చూడ మన్చెప్పిన కావేరి పట్ల నాలో తీవ్రమైన నిరాసక్తత ఏర్పడిపోయింది.

తనకంటూ ఓ వ్యక్తిత్వం లేని మనుషుల్ని నేను గౌరవించలేనూ.... ప్రేమించనూ లేను.

✦ ✦ ✦

ఈ రోజున పద్మప్రియకు ఇరవై ఒక్క సంవత్సరాలు. నా పక్కన కూచుని ఏడుస్తోంది. నాకు తెలుసు ఆ దుఃఖం తన గురించీ,నా గురించీ కాదు. అన్ని సంవత్సరాలు ఈ ఇంట్లో ఏ విధమైన అస్తిత్వం లేకుండా ఈ రోజున హఠాత్తుగా తన శూన్యంతో ఈ ఇల్లంతా నిండిపోయిన కావేరి గురించి, వాళ్లమ్మ గురించి....

కావేరీ మరణించి సరిగ్గా నాలుగు నెలలైంది. నిజానికి నాకుతెల్సు.కావేరినలా వదిలేసుంటేఇంకో పదిహేనేళ్లు జీవించుండేది. 'నువ్వు బతకనవసరం లేదు' అని నేను యథాలాపంగా అన్న మాటను తీవ్రంగా మనసుకు తీసుకుని కావాలనే చనిపోయింది కావేరి.

మనసు విరిగి... ఆత్మ నలిగి మరణించింది.

నాకిప్పుడు స్పృహ కలుగుతోంది. నా వయొలిన్ని నేను తాకి, పలికిస్తేనే పలుకుతోంది... కావేరినలాగ పలికించలేకపోయానా? లేదూ, కావేరి కూడా నా

వయెలీన్లాగే నాక్కావలసిన రాగాలూ రంగులూ పలికిందా....

ఏమైతేనేమిప్పుడు

మౌనమై కావేరిప్పుడు లేదు...

జాలి కళ్ల కావేరి లేదు.

గాజు బొమ్మ కావేరి... పగిలిపోయింది.

వెన్నెలంత కావేరి... కావిరైంది.

రెల్లుపూవు కావేరి.. చెల్లిపోయింది.

నౌ షి ఈజ్‌కాన్సిక్వ్యువన్ బై బీయింగ్ యాప్సెంట్!

✦ ✦ ✦

సరిగ్గా ఆరు నెలల క్రితం ఓ రాత్రి... పదకొండూ ఆ ప్రాంతంలో నా గదిలోకి నిశ్శబ్దంగా ... నిశ్శబ్దంలా వచ్చింది. రంగారావు థీసిస్ మాన్యూ స్క్రిప్ట్ చూస్తున్నాను.

ఆమెకంటే ముందు ఆమె పరిమళం గదిలోకి ప్రవహించింది. తన బట్టల బీరువాలో ఎప్పుడూ మొగిలి రేకులు దాస్తుంది కావేరి. నా టేబుల్ ఎదురుగా చెయిర్ చివర కూచునీ కూచోకాకూచుంది. అన్నిసంవత్సరాల్లో తనుకనీసం నా ముందు ఫ్రీగా కూచుని ఎరుగదు. 'చెప్పు' అన్నట్టు చూశాను. ఆ రోజు ఉదయమే వాళ్లన్నయ్య విశ్వనాథ శాస్త్రి వచ్చాడు. అతనూ నాతోటి కలివిడిగా మాట్లాడ్డు. అతనే కాదు. వాళ్లింట్లో అందరూ అంతే నన్నో గ్రహాంతరవాసిని చూసినట్లు చూస్తారు. ఉదయం లేచేసరికి అతనున్నాడు. తెల్లవారుజామున వచ్చినట్టున్నాడు. కాఫీ తాగుతోంటేవంట గదిలోంచి వచ్చాడు. వాళ్లమ్మాయి పెళ్లి కుదిరిందన్నాడు. 'శుభం' అన్నాను. వివరాలేమీ నేనూ అడగలేదు. అతనూ చెప్పలేదు. ఆ విషయమయ్యే మాట్లాడానికొచ్చింది కావేరి అని నాక్తెలుసు. అయినా సరే 'చెప్పు'అన్నా మళ్లీ.

"మాధవికి పెళ్లి కుదిరిందని అన్నయ్యొచ్చాడు!" మెల్లగా అంది.

"చెప్పారు బావగారు ఉదయాన్నే!"అన్నాను.

"మీకు తెలుసు వదినె కాలం చేసింది... పీటల మీద కూచుని కన్యాదానం చేసేందుకు..." అంటూ ఆపేసింది.

అతి సాధారణ విషయమది. ధైర్యంగా చెప్పొచ్చు. అసలు చెప్పడమేమిటి నన్ను సంప్రదించాల్సిన అవసరం లేకుండానే మా బావగారికి కావేరి మాటివ్వొచ్చు 'అన్నయ్యా!నేనూ, మీ బావగారూ కన్యాదానం చేస్తా'మని ఎందుకో తెలీదు ఉదయం నుంచీ చికాకుగా ఉంది. అదీకాక యూనివర్సిటీలో గొడవలు.. మళ్లీ కావేరివైపు చూసేసరికి ఎందుకో అకారణంగా కోపమొచ్చింది. అణుచుకుంటూనే...

"అయితే?! అన్నాను.

"మీ మాట తీసుకుని మనిద్దర్నీ పీటల మీదా ..... అని అడిగేందుకు" ముక్కలు ముక్కలుగా మాట్లాడింది.

చికాకూ కోపమూ ఎక్కువైపోయాయి. అది చీకాకో... లేదూ కావేరిమరణానికి

దారి తీసే దుర్మార్గపు క్షణమో...

చదూతున్న రంగారావు థీసిస్ టేబుల్మీదకి విసిరి లేచాను. తనూ దిగ్గున లేచింది.

"చూడు, కావేరీ! ఇది చాలా చిన్న విషయం సో ట్రివియల్... ఇంత చిన్న విషయంలో కూడా నిర్ణయం తీసుకునే అధికారం, స్వతంత్రం నీకు లేవా? లేదూ, నేను నీకివ్వలేదా? చెప్పు....

ఎందుకిలా వ్యక్తిత్వరహితంగా ప్రవర్తించి నన్ను హింసిస్తావు? ఇలా వ్యక్తిత్వం లేని బతుకు బతకడం కంటే.. ఛీ!" ...నోరు జారేశాను..... స్పృహలోకి వచ్చి చటుక్కున కావేరి వేపు చూశాను.

ఆమె కళ్లు పూర్తిగా వికసించిపోయాయి. విస్మయంతో నమ్మలేనట్టు. ఈ ప్రపంచం యావత్తూ తన్ని దగా చేసినట్టు... గాజుబొమ్మ కావేరి... వెన్నెలమ్మ కావేరి... లేచి పొగలాగా గదిలోంచి వెళ్లిపోయింది. కావేరికి నచ్చచెప్పే ప్రయత్నంలో కావేరి వెంటే నేనూ గదిలోంచి బైటికొచ్చాను. డ్రాయింగ్రూం కోచ్‌లో జారగిలి మా బావగారు ఏదో పుస్తకం చదువుకుంటున్నారు. కావేరి ఆమెను వెన్నెంటే నేను రావడం చూసి దిగ్గున లేచికూచుని పంచె సర్దుకున్నాడాయన. నాకంటే పెద్దవాడూ.. తహసీల్దారుగా ఉన్నాడు.. నేను కొంచెం గొంతు పెద్దదిగా చేసి ఆయన్తోటి అన్నాను.

"ఏవిటండీ బావగారూ! ఇంత చిన్న విషయానిక్కూడా నా పర్మిషన్తీసుకోవాలా? మాధవి మాకు మాత్రం బిడ్డ కాదూ!"

"అదీ.... పుట్టినే మిమ్మల్నో మాటు అడిగీ ... సంప్రదాయం... ఏదోలెండి!" అంటూ ఆయన నసిగాడు.

అప్పటికా సంగతి మరచిపోయాను. పది రోజుల్తర్వాత మాధవి పెళ్లి - నేను, కావేరి పీటల మీద కూచుని అబ్బాయికి కాళ్లు కడిగి కన్యాదానం చేశాం. పద్మప్రియ సందడిగా పెళ్ళిల్లంతా తానే అయి తిరిగింది. రొటీన్నించీ మాకూ ఓ మూడ్రోజులురిలీఫ్ .... ఈ మధ్యలో కావేరిని పట్టించుకోలేదు నేను...

ఏనాడు పట్టించుకున్నాను గనుక?"

✦ ✦ ✦

తర్వాత ఓ పదిహేనురోజులకు ఓరాత్రి ప్రియ గాబరాగా నా గదిలోకొచ్చి..

"నాన్నా!అమ్మకి నలతగా ఉన్నట్టుంది. నాన్నా! షి ఈజ్ సిక్... షి ఈజ్ నాటీవెనీటింగ్!" అంది.

వెళ్ళి చూశాను. ముడుచుకు పడుకుంది. 'లేపు' అన్నట్టు ప్రియవేపు చూశా.

"మా! అమ్మా! నాన్నొచ్చాడు. చూడవే, లే....!" ప్రేమతో తడిసిన గొంతుతో.

గాజు కళ్లు తెరుచుకున్నాయి. నన్ను దీనంగా చూసింది. లేవబోయింది. "వద్దు... లేవొద్దు!" వారించి పక్కన కూచుని.

"ఏవిటీ ఒంట్లో బావులేదా?" మృదువుగా అడిగా, అవే గాజుకళ్ల చూపులు.. నేను ప్రియవైపు తిరిగి...

"అమ్మలూ! ఎప్పట్నించే ఇలా?" అడిగాను.

"నిన్న నేను భోజనం చేస్తూ గమనించా.

నాన్నా! అమ్మ తింటంటే! ఏమిటే అనడిగా. షి జస్ట్ స్మైల్డ్. నేను పెద్దగా పట్టించుకోలే. ఈ రోజుదయాన్నే కాలేజ్‌కెళ్తూ చెప్పా. భోయనం చెయ్యవే అని అయ్ థింక్ షి డింట్. రాత్రి మళ్ళీ అడిగా. అసలు పెరుగూ అన్నం కలిపిచ్చాను. ఓ ముద్ద పెరుగన్నమేనా తినవే అని. ఊహూఁ..." ప్రియ కళ్ళనిండా నీళ్లతో చెబుతుంది. మంచానికటువైపు నుంచీ వెళ్ళి వాళ్లమ్మ పక్కన అనుకుని కూచుని వాళ్లమ్మ చుట్టూ చేయి వేసి దగ్గరికి లాక్కుని అంది....

"అయ్ థింక్ షి ఈజ్బీన్ స్టార్వింగ్ ఫార్ సండేస్ నాన్నా! ప్లీజ్ నానా, శంకరం మామయ్యకి రింగ్చేయ్ నానా! నాకెందుకో భయమేస్తోంది!"

శంకరొచ్చాడు చూశాడు.

"ఆల్ వైటల్ సైన్స్ ఆర్ ఓకే! షి ఈజ్ స్టార్వింగ్!" అన్నాడు అని కావేరీ వైపు తిరిగి,

"అమ్మా కొద్దిగా పాలైనా తాగండి... లేదూ కొద్దిగా గ్లూకోజైనా నీళ్లతో కలిపి తీసుకోండి! అన్నాడు కావేరితో.

తల అడ్డంగా ఊపుతూ వద్దంది.

శంకరం నాతో అన్నాడు "ఇఫ్ షి టేక్సివ్ సంథింగ్ షి మస్ట్ బి ఆల్ రైట్ బై మోనింగ్! నథింగీజ్ రాంగ్... షి ఈజ్ స్టార్వింగ్, దట్సాల్! హాస్పిటల్‌కి తీసుకెళ్తే ఫ్లూయిడ్స్ పెట్టొచ్చు. ఆలోచించండి. ఏ సంగతీ నాకు ఫోన్జేయండి. ఐ విల్ బి హోమ్!" అని వెళ్ళిపోయాడు.

ప్రియ వాళ్లమ్మ పక్కనే కావలించుకుని కూచుంది. నేను పక్కగా కుర్చీలో కూలబడ్డా. కాసేపటికి మెల్లిగా ముందుకు వంగి...

"ఎందుకని కావేరీ? ఇలా... ఎవరి మీది అలకా? కొద్దిగా పాలైనా తాగు! అమ్మలూ! వెళ్ళవే, కాసిని పాల్తీసుకురా!" అన్నా.

లేవబోతున్న ప్రియ చేయిపట్టుకుని వారించి వద్దన్నట్లు తలాడిస్తూ, "రేపుదయాన్నే తీసుకుంటా!" గాలితో మాట్లాడ్తూ అంది.

శంకరమొచ్చి చూసెళ్లాడు కాబట్టి కొద్దిగా ధైర్యంగానే ఉన్నా... ముందే గువ్వలాంటి మనిషి తను.... మరీ క్రుశించింది. అసలే పెద్దకళ్లు ఆ వాడిన మొహంలో ఇంకా పెద్దగా కనబడుతూ గాజు కళ్లలా ఉన్నాయి. ఆ గాజు కళ్లు విశాలంగా తెరిచి నన్నే చూస్తోంది కావేరి. ఎందుకో ఆ కళ్లలోకి చూళ్లేక కళ్లు మూసుకు వెనక్కి వాలిపోయా. ఎప్పుడు పట్టిందో మాగన్నుగా కునుకు..

"నా...న్నా!" ప్రియ అరిచినట్టు పిలిచిన పిలుపుకి ఉలిక్కిపడి లేచా.

"అమ్మేడుస్తోంది నానా! మా! అమ్మా! ఏమిటో చెప్పవే మా!" ప్రియ ఏడుస్తోంది.

పాతిక సంవత్సరాల్లో కావేరి కంటనీరు చూసెరుగన్నేను.... గుండె దడదడ

లాడ్తోండగా వెళ్లి పక్కన కూచున్నా.

'కావేరీ! ఏమిటిది... ఏమైంది చెప్పు... ఎందుకీ ఆవేదన...ఎవరి మీదీ అలుక చెప్పు!' నుదుటిమీద చెయ్యేసి అన్నాను.

రెండు చేతుల్తో నా చేతిని పట్టుకుని ముఖానికానించుకుంది. ఆమె కన్నీళ్లతో నా చేయి తడిసిపోయింది.

"మా!" అంటూ ప్రియ గట్టిగా ఏడుస్తోంది. చిన్నగా పెదవులు కదిలిస్తూ ఏమో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తోంది కావేరి. ఆ పెదవులకి దగ్గరా చెవి ఆనించాను.

"ఈ....ఈ..... బ్రతుకు బ్రతకడం..... కంటే..." ప్రవహిస్తున్న కావేరి ఆగిపోయింది.

తెలిసిపోయింది... నేనేం చేసినా ఆనందంగా స్వీకరించిన కావేరి నేను తనను అసహ్యించుకోడం తట్టుకోలేకపోయింది. నేనే కావేరిని చంపేశాను.. నేను చేసిన హత్యకి సాక్ష్యం లేదు...

జాలికళ్ళ కావేరీ లేదు.

గాజు బొమ్మ కావేరి.... పగులగొట్టేశాను.వెన్నెలంత కావేరి.. కటిక చీకటైపోయింది.

రెల్లు పూవుకావేరి.. చెల్లిపోయింది...

నే చేసిన హత్యకు సాక్ష్యం లేదు.... ✦

**(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 13 సెప్టెంబర్ 1999)**